క్లుప్తంగా

క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న కొప్పుల వేణారెడ్డి

సూర్యాపేట : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సూర్యాపేట నియోజకవర్గ స్థాయి – కబడ్డీ క్రీడోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యండీ అంజద్ అలీ, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్ నాయుడు, శ్రీదండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పందిరి మల్లేష్ గౌడ్, పట్టణ ఓబీసీ సెల్ అధ్యక్షుడు రావుల రాంబాబు, మందాడి కిరణ్, జిల్లా పరిషత్ పాఠశాల సిబ్బంది, ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ట్రైనర్లు పాల్గొన్నారు.

కేసు నమోదు

తిరుమలగిరి : వెలిశాల గ్రామ పరిధిలో ఎస్సారెస్పీ కాల్వ మట్టిని సోమవారం రాత్రి అక్రమంగా తరలిస్తుండగా స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు రెండు టిప్పర్లు, ఒక హిటాచిపై కేస్ నమోదు చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చివ్వెంల : భూ తగాదాల నేపథ్యంలో మహిళపై దాడి కేసులో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ మహేశ్వర్ తెలిపారు. మండల పరిధిలోని ఎంజీనగర్‌తండాకు చెందిన రత్నావత్ జానమ్మపై అదే గ్రామానికి చెందిన రత్నావత్ మహేష్, రత్నావత్ రవి, రత్నావత్ శ్రీనులు ఈ నెల 10వ తేదీన దాడి చేసి గాయపర్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి.మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దాడి చేసిన ముగ్గురిని మంగళవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనిరెడ్డిగూడెం గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన రోటరీ క్లబ్ ఆఫ్ చేంజ్ మేకర్స్ ఆధ్వర్యంలో ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్స్ సహకారంతో నేడు ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు జూలకంటి యోగేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి పడాల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అవయవదానానికి అంగీకారం



అంగీకార పత్రం తీసుకుంటున్న స్పందన అవయవదాన సభ్యులు

సూర్యాపేట : సూర్యాపేట పట్టణానికి చెందిన ఖమ్మంపాటి సత్యం(72) తన మరణానంతరం శరీర అవయవ దానానికి అంగీకారం తెలుపుతూ స్పందన అవయవదాన సభ్యులకు అనుమతి పత్రాన్ని అందజేశారు. మంగళవారం స్పందన అవయవదాన అధ్యక్ష, కార్యదర్శులు గుండా రమేష్, మిట్టకోళ్ల కోటయ్య, కోశాధికారి పిచ్చిరెడి, గౌరవాధ్యక్షుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు జి.రమేష్ సదరు వ్యక్తి నుంచి అంగీకార పత్రం స్వీకరించారు. ఈ సందర్భంగా సత్యంను పలువురు అభినందించారు.

యూరియా అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు

మద్దిరాల: యూరియాను అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారిణి అనిషారూహి అన్నారు. మండల కేంద్రంలోని స్వర్ణ ఫర్టిలైజర్‌లో యూరియాను అధిక ధరకు అమ్ముతున్నట్లు రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ షాపును మంగళవారం సీజ్ చేసినట్లు తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు ఆ షాపు నుంచి ఎలాంటి మందులను అమ్మేదిలేదని పేర్కొన్నారు.

సభను జయప్రదం చేయాలి

నూతనకల్ : మండల కేంద్రంలో ఈ నెల 19న జరిగే ట్రాన్స్‌పోర్టు డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని రోడ్డు ట్రాన్స్‌పోర్టు డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం. రాంబాబు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంతం వెంకన్న, యల్లయ్య, నాగయ్య, సైదులు, గణేష్, వీరయ్యనాయక్, తులస్య, కృష్ణ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆరుబయట వంటతో అవస్థలు

- పాఠశాలల్లో వంట గదుల ఏర్పాటులో ప్రభుత్వ నిర్లక్ష్యం
- వర్షాకాలం కావడంతో ఇబ్బందులు పడుతున్న ఏజెన్సీ మహిళలు



ఆరుబయట వంట చేస్తున్న మహిళలు

ఆత్మకూర్(ఎస్) : ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహణకు వంట గదులు లేకపోవడంతో ఏజెన్సీ మహిళలు వంట చేయడానికి అష్ట కష్టాలు పడుతున్నారు. ప్రధానంగా వర్షాకాలంలో కట్టెలు తడవడంతోపాటు వంట సమయంలో వర్షం వస్తే వంట చేయడానికి ఏజెన్సీ మహిళల కష్టాలు వర్ణణాతీతంగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రయత్నం చేస్తున్న ప్రభుత్వాలు.. వంట చేయడానికి మాత్రం గదులు నిర్మించకపోవడం శోచనీయం.

20కి పైగా పాఠశాలల్లో..

ఆత్మకూరు మండలంలో 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత పాఠశాలలు, 41 ప్రాథమిక పాఠశాలలతోపాటు మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ, గురుకుల బాలుర పాఠశాల, మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల ఉన్నాయి. కాగా 20కి పైగా పాఠశాలల్లో వంట చేయడానికి గదులు లేకపోవడంతో ఆరు బయట, పడావుబడ్డ గదులలో అపరిశుభ్రత నడుమ వంట వండుతున్నారు.

వర్షాల సమయంలో తీవ్ర అవస్థలు..

వంట గదులు లేకపోవడంతో వర్షాలు వచ్చే సమయంలో ఏజెన్సీ మహిళలు ఆరు బయట కూరగాయలు కోయడానికి ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షానికి కట్టెలు తడవడం, దీనికితోడు గాలి వీయడంతో కొన్ని సమయాల్లో వంట కూడా సక్రమంగా కావడంలేదని ఏజెన్సీ మహిళలు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని లక్ష్యం నెరవేరాలంటే ప్రతి పాఠశాలలో వంటగది నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

కట్టెలు తడుస్తున్నాయి



మధ్యాహ్న భోజనం చేయడానికి వంటగది లేకపోవడంతో మోడల్ స్కూల్‌లో ఆరు బయటనే వంట చేస్తున్నాం. గాలి దుమ్ము వచ్చిన సమయంలో, వర్షాలు వచ్చిన సమయంలో తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. కట్టెలు తడిసి వంట కావడం లేదు. కూరగాయలు కోయాలన్నా ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. వంటగది ఉంటే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించవచ్చు.

– దాసరి ముత్తమ్మ, ఏజెన్సీ మహిళ

సద్దుల చెరువులో వినాయక విగ్రహాల తొలగింపు



సూర్యాపేటలోని సద్దుల చెరువులో నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాలను మంగళవారం తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట



విగ్రహాలను తాడుతో బయటకు లాగుతున్న మున్సిపల్ సిబ్బంది

మోడల్ స్కూల్‌లో మాక్ ఎలక్షన్



ఓటు వేస్తున్న విద్యార్థిని

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని పీఎంశ్రీ ఆదర్శ పాఠశాలలో మంగళవారం సోషల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాక్ ఎలక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓటర్ లిస్టు నిర్వహణ, నామినేషన్స్, స్క్రూటిని, పోలింగ్ కేంద్రంలో వివిధ రకాల హోదాల నిర్వహణ, ఓటింగ్ వినియోగం, కౌంటింగ్ తదితర అంశాలపై ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. కౌంటింగ్ అనంతరం విజేత ప్రకటన తదితర విషయాలపై తెలియజేశారు. విద్యార్థులు రాజకీయాలపై, గ్రామపంచాయతీతోపాటు శాసనసభ, పార్లమెంట్ వ్యవస్థల్లో ఎన్నికల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ శ్రీనివాస్ అన్నారు. మాక్ పోలింగ్ ద్వారా విద్యార్థులలో నాయకత్వం లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. మాక్ పోలింగ్ ద్వారా ఎన్నికైన దుర్గాప్రసాద్, పావని, వసికర్, అశ్వితలను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూతం యాకమల్లు, రమేష్, శ్రీను, కరుణాకర్, తిరుమలేష్, గణేష్, సుధాకర్, కృష్ణయ్య, శ్రీధర్, బాబు, రుక్మిణి, జ్యోతి, రంగారెడ్డి, లక్ష్మి, నిర్మల, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే



ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొన్న పటేల్ రమేష్ రెడ్డి, అధ్యాపకులు

సూర్యాపేట : పట్టణంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ మహిళా కళాశాలలో 2025–2026 విద్యాసంవత్సరానికి సంబంధించిన మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నతస్థానాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పటేల్ రమేష్‌రెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీవాణి, అధ్యాపకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మౌనిక, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన



సూర్యాపేటటౌన్ : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైం సీఐ లక్ష్మీనారాయణ



తిరుమలగిరి : మాట్లాడుతున్న ఎస్‌ఐ

సూర్యాపేటటౌన్ : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ సీఐ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా పీస్ ఫోరం ట్రస్ట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగాయని, యువతపై వీటి ప్రభావం అధికంగా ఉందన్నారు. సైబర్ నేరాల శాతం పెరుగుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, కొత్త వ్యక్తులు ఎవరు ఫోన్ చేసినా బ్యాంకు సంబంధించిన లావాదేవీలు వ్యక్తిగత విషయాలను తెలుపకూడదన్నారు. సైబర్ మోసాలపై డయల్ 100, 1930 నంబర్లకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డాక్టర్ వెంకటేశులు మాట్లాడారు. మొబైల్‌కు వచ్చే అనవసరమైన లింకులను క్లిక్ చేయకూడదని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీస్ ఫోరం ఎండీ దయానంద్, సీఈఓ అశోక్ వర్ధన్, మేనేజర్ ఎండీ షకీరా, కళాశాల వైస్ ప్రిన్సిపల్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

తిరుమలగిరి : సైబర్ మోసాలకు బలి కాకుండా ఉండాలని, ఆర్థిక లావాదేవీల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని తిరుమలగిరి ఎస్‌ఐ సీహెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు. సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం తిరుమలగిరిలో ఎంఎస్‌ఎంఈ గూగుల్ ఏసియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నకిలీ మెసేజీలు, ప్రాంక్ కాల్స్, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ ముజీబ్, ట్రేడర్ రాము, కొండారెడ్డి, విప్లవకుమార్, లక్ష్మయ్య, భాస్కర్, రామకృష్ణ, ప్రతాప్, ఉపేందర్, చేను శ్రీను, కిష్టునాయక్, నరేష్, రామ్‌లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట వారోత్సవాలు



నాగారంలో అమరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సూర్యాపేట : మండల పరిధిలోని సోలిపేట, రామచంద్రపురం గ్రామాలలో మంగళవారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి నాయకులు బీరవోలు సంజీవరెడ్డి, అనంతుల శ్రీరాములు, కందుకూరి చిన్న నరసయ్య, బోడ మైసయ్యల స్థూపాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎర్రజెండా పాటలు పాడుతూ.. సాయుధ పోరాట యోధులను స్మరించుకున్నారు. సాయుధ పోరాటాలలో ప్రధాన పాత్ర పోషించినది సీపీఎం అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు చెరుకు యాక లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యుడు మేకన బోయిన శేఖర్, మండల కార్యదర్శి మేరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు చెరుకు సత్యం, రామచంద్రాపురం గ్రామ శాఖ కార్యదర్శి జలగం సత్తయ్య, మండల కమిటీ సభ్యులు మారం చంద్రారెడ్డి, పాదిల అంజయ్య, మండల్ రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

నాగారం : తెలంగాణ సాయుధపోరాట చరిత్రను మతోన్మాద బీజేపీ వక్రీకరిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని డి.కొత్తపల్లి, నాగారం, ఫణిగిరి, ఈటూరు గ్రామాల్లో తెలంగాణ సాయుధ పోరాట యోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం నాగారం ఎక్స్‌రోడ్డులో తెలంగాణ సాయుధ పోరాట యోధులైన పుచ్చలపల్లి సుందరయ్య, చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, మల్లు వెంకట నరసింహారెడ్డి తదితరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈటూరు గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధులు గంట రాఘవరెడ్డి దంపతులను, డి.కొత్తపల్లి గ్రామంలో పోరాటయోధుడు నాతి లింగయ్య సతీమణి సోమక్కలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం, మండల కార్యదర్శి దేవరకొండ యాదగిరి, కడియం కుమార్, గుడిపూడి వెంకటేశ్వర్లు, దేవరకొండ వెంకన్న, మల్లేపాక సోమయ్య, యాదయ్య, లక్ష్మణ్, పార్వతమ్మ, ఎస్‌కె. ఆశ, మల్లమ్మ, రాములు, మల్లికార్జున్, మొగిళ్ల భిక్షం, పేరాల యాదగిరి, బండ్ల అంజయ్య, గంట నరసింహారెడ్డి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్లకు భరోసా

సూర్యాపేట: జేబీఎం యూనివర్సల్ ఎలక్ట్రిక్ బస్సుల డ్రైవర్లకు యాజమాన్యం ఎలాంటి ఇబ్బందులు రాకుండా పూర్తి భరోసా కల్పిస్తోందని ఆపరేషన్ మేనేజర్ వెంకట సురేష్ తెలిపారు. మంగళవారం స్థానిక డిపో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డ్రైవర్లు కోరిన ఐడీ కార్డులు, హెల్త్ కార్డులు, పీఎఫ్, బస్‌పాస్, అపాయింట్‌మెంట్ లెటర్లు, శాలరీ పేమెంట్ డేట్ వంటి సౌకర్యాలను అక్టోబర్ 30లోగా అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కొంతమంది జేబీఎం యూనివర్సల్ ఎలక్ట్రిక్ యాజమాన్యంపై కావాలని అవాస్తవాలు, ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్స్ రిక్రూమెంట్ అధికారి రామారావు, పార్కింగ్ ఇన్‌చార్జ్ అడ్మిన్ సైమన్ పాల్గొన్నారు.

17న విద్రోహదినంగా జరపాలి

చివ్వెంల : సెప్టెంబర్ 17ను విద్రోహ దినంగా జరుపాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని కుడకుడ గ్రామ శివారులోని లెనిన్‌నగర్‌లో జరిగిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. సాయుధ పోరాటంతో సంబంధం లేని బీజేపీ నాయకులు ఉత్సవాలు జరుపడం సిగ్గుచేటు అన్నారు. నల్లజెండాలతో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమనపల్లి ప్రకాశ్, ఐతరాజు నవీన్, వంటికొమ్ము నగేష్, సన్ని తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అవగాహన

మద్దిరాల : చిన్నారులకు ఆరోగ్యం, తగినంత పోషకాహారం ఉన్నప్పుడే మంచిగా చదువుకునే అవకాశం ఉందని పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ శివ, ట్రైనింగ్ సూపర్‌వైజర్లు అనురాధ, మంగమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పోషణ్ భీ, పడాయి భీ కార్యక్రమంపై మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గుర్వోజు రమాదేవి, సహెదా, హైమావతి, శ్రీవాణి, సరస్వతి, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విష్ట ఇన్ఫ్రా బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మోదీ ప్రాపర్టీస్ సభ్యులు

సూర్యాపేట : విలాసవంతమైన నివాసాల కు కేరాఫ్ అడ్రస్ మోదీ ప్రాపర్టీస్ అని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో మోదీ ప్రాపర్టీస్ ప్యానల్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ట ఇన్ఫ్రా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. సూర్యాపేటలో సామాన్యులకు సైతం అందుబాటులో ఉండే ధరలో మోదీ ప్రాపర్టీస్ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలి పారు. డబుల్ బెడ్ రూమ్, ట్రిపుల్ బెడ్ రూమ్ ఇళ్ల ను తక్కువ ధరల్లో విలాసవంతమైన సౌకర్యాలతో నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 28న విస్టా టవర్స్ గ్రాండ్ లాంచింగ్ చేపడుతున్నట్లు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా మోడీ ప్రాపర్టీస్ ఆధ్వర్యంలో విలాసవంతమైన భవనాలు నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడీ ప్రాపర్టీస్ ఎండీ సోహన్ మోడీ, ప్రాజెక్టు ఇన్‌చార్జ్ సచిన్, ఉప్పల రాజేంద్ర ప్రసాద్, ఉప్పల ఆనంద్, తోట శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

సూర్యాపేట : శ్రీవేణుగోపాలస్వామి ఆశిస్సులు ప్రజలందరిపై ఉండాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఉట్లు కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. 40 ఏళ్లుగా ఆండాల్ గోష్టి భక్త బృందం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం యాదవులు, భక్తులు ఉట్లు కొట్టి పాలవెల్లి బూరెల ముకుడును అందుకున్నారు. కార్యక్రమంలో పెద్దగట్టు చైర్మన్ పోలెబోయిన నరసయ్య యాదవ్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కెక్కిరేణి శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, ఆలయ ప్రధాన అర్చకుడు నల్లన్ చక్రవర్తుల మురళీధరచార్యులు, కాంగ్రెస్ నాయకులు, ఆండాళ్ గోష్టి భక్త బృందం, తదితరులు పాల్గొన్నారు.

శ్రీయోగానంద లక్ష్మీనర్సింహఆలయాల్లో..

అర్వపల్లి : అర్వపల్లి, జాజిరెడ్డిగూడెంలలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయాల్లో సోమవారం రాత్రి కృష్ణాష్టమి వేడుకలను యాదవ సంఘాల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. తొలుత ఆయా ఆలయాల్లో యాదవులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్తంభాన్ని పాకుతూ బూరెలమాకు జరిపారు. ఆ తర్వాత ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు ఉట్లు కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి



ధర్నా చేస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

సూర్యాపేట అర్బన్ : రైతులకు సరిపడా యూరియా అందించాలని, బ్లాక్ మార్కెట్‌లో యూరియా దందా అరికట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ మాట్లాడారు. యూరియా సరఫరాలో తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతోందని అన్నారు. ఇదే అదునుగా భావించిన కొంతమంది దళారీలు యూరియాను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని ఆరోపించారు. బ్లాక్ మార్కెట్‌లో యూరియా అమ్ముతున్న వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్ కుమార్, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు పేర్ల నాగయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ హుజూర్‌నగర్ డివిజన్ కార్యదర్శి వాసపల్లయ్య, సహాయ కార్యదర్శి చెరుకు ఎల్లయ్య, టీయూసీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ హుస్సేన్, సహాయ కార్యదర్శి గోగుల వీరబాబు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, జయమ్మ, రేష్మ, పావని, లక్ష్మి, అంజయ్య, మోహన్, కల్పన, రేణుక, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో అక్రమాలు

- రూ.5.30 లక్షలు దుర్వినియోగం

చివ్వెంల : పేదల జీవనోపాధి కోసం నిర్వహిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అధికారుల నిర్లక్ష్యం వల్ల అబాసుపాలవుతోంది. మండల వ్యాప్తంగా 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు రూ.8.07 కోట్ల వ్యయంతో చేపట్టిన ఎన్ఆర్ఈజీఎస్ పనులపై సామాజిక తనిఖీ కార్యక్రమాలు నిర్వహించారు. అయితే ఉపాధి పనులలో పలు అక్రమాలు వెలుగుచూశాయి. మండల వ్యాప్తంగా 31 గ్రామాలకు గానూ సోమవారం 20 గ్రామాలకు సంబంధించిన వివరాలను సంబంధిత గ్రామాల డీఆర్‌పీలు చదివి వినిపించారు. అయితే పనుల్లో రూ.5.30 లక్షల నిధులు దుర్వినియోగం అయినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఎంపీడీఓ, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. మిగిలిన గ్రామాలకు బుధవారం ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించనున్నటు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఏపీడీ శిరీష, అంబుడ్స్‌మెన్ లచ్చిరాం నాయక్, ఎంపీడీఓ సంతోష్ కుమార్, ఎంపీఓ దయాకర్, ఏపీఓ నాగయ్య, ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మద్దిరాల : పోలుమల్ల పాఠశాలలో మొక్కలు నాటుతున్న ప్రధానోపాధ్యాయుడు జహీర్

నాగారం : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మండల విద్యాధికారి వాసం ప్రభాకర్ అన్నారు. యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ యానాల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మొక్కలు నాటి సంరక్షించాలని, భూమి, నీరు, గాలి కలుషితం కాకుండా చూడాలని అన్నారు. ఔషధ తోటలు, వృక్షారోహణ వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం జ్ఞానేశ్వరచారి, పీఎస్ హెచ్‌ఎం రాందాస్‌నాయక్, జుట్టుకొండ నవీన్, ఉపాధ్యాయులు, స్కూల్ ఎర్త్ లీడర్స్ పాల్గొన్నారు.

మద్దిరాల : ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని పోలుమల్ల పీఎంశ్రీ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు జహీర్ అన్నారు. మంగళవారం ప్రపంచ ఓజోన్‌డే సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

అర్వపల్లి : నిజామాబాద్ జిల్లాలో గౌడ కులస్తులపై ఎక్సైజ్ శాఖ వీడీసీ పోలీసులు జరిపిన దాడిని ఖండించిన మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్‌ను నిర్మల్ పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం తగదని మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు జేరుపోతుల లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. మోకుదెబ్బ జాజిరెడ్డిగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అర్వపల్లిలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. గౌడకులస్తులపై దాడిచేసిన వారిని శిక్షించాలని, లేనిచో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా రాదాయే.. పడిగాపులు తప్పవాయే



అర్వపల్లిలోని పీఏసీఎస్ ఎదుట యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు

అర్వపల్లి : అర్వపల్లిలోని పీఏసీఎస్‌కు మంగళవారం తెల్లవారుజాము నుంచే వివిధ గ్రామాలకు చెందిన రైతులు యూరియా కోసం తరలివచ్చారు. అయితే యూరియా రావడం లేదని, రైతులు ఇళ్లకు వెళ్లిపోవాలని పీఏసీఎస్ సిబ్బందితోపాటు పోలీసులు కోరగా రైతులు వెళ్లిపోయారు. కొందరు రైతులు సాయంత్రం వరకు వచ్చివెళ్తూనే ఉన్నారు. యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

సభ్యత్వ నమోదు

అర్వపల్లి : గొర్రెల కాపరుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల రమేష్ కోరారు. రామన్నగూడెంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. గొర్రెల కాపరులను గుర్తించి గుర్తింపుకార్డులు ఇవ్వాలని, ప్రతి సొసైటీకి 10ఎకరాల భూమిని కేటాయించి జీవాలు మేపుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఖాళీగా ఉన్న పశువైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని, 60ఏళ్లు నిండిన కాపరులకు పింఛన్ అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి వజ్జె వినయ్‌యాదవ్, మండల అధ్యక్షుడు కాంచాని భద్రయ్య, సోమయ్య, శంకర్, వెంకన్న, మల్లయ్య పాల్గొన్నారు.